




నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఆదిలాబాద్

మంచిర్యాల
నిర్మల్ - కొమరం భీం
ఆసిఫాబాద్

శనివారం 21 జూన్ 2025 పేజీలు 05


### విద్యార్థుల భవిష్యత్తుపై మాదకద్రవ్యాల ప్రభావాన్ని

## నియంత్రించాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల బ్యూరో,సూర్య మేజర్ న్యూస్**

పాఠశాలల, కళాశాలల విద్యార్థుల భవిష్యత్తుపై మాదకద్రవ్యాల



ప్రభావాన్ని నియంత్రించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో మాదకద్రవ్యాల నియంత్రణపై డి.సి.పి, భాస్కర్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్ రావు, హరికృష్ణ, జిల్లా ఆబ్కారీ-మధ్యనిషేధ శాఖ అధికారి నందగోపాల్, జైపూర్, బెల్లంపల్లి ఎ.సి.పి.లు వెంకటేశ్వర్లు, రవికుమార్, మానసిక వైద్య నిపుణులు డా.సునీల్కుమార్ లతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, విక్రయం, వినియోగాలను నిరోధించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. మాదకద్రవ్యాలు, గంజాయి ఇతరత్రా మత్తుపదార్థాలు వినియోగించడం వల్ల కలిగే నష్టాలను అర్థమయ్యేలా ర్యాలీలు, వ్యాసరచన, చిత్రలేఖనం, క్లబ్ల ఏర్పాట్లు ఇతర వివిధ రకాల పద్ధతుల ద్వారా అవగాహన కల్పించాలని, మానసిక వైద్య నిపుణులచే శిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ( మిగితా...2లో )

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్**

వివిధ సమస్యలపై ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్లో గల కలెక్టర్ చాంబర్లో జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహశిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ రకాల సమస్యలపై అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. శాఖల వారిగా పెండింగ్లో ఉన్న దరఖాస్తుల వివరాలపై సంబంధిత శాఖల అధికారులతో పెండింగ్కు గల కారణాలపై సమీక్షించి త్వరగా పరిష్కరించేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. జిల్లా రవాణా శాఖ పరిధిలో నూతన లైసెన్సు, వాహనాల పర్మిట్, ఫిట్నెస్ దరఖాస్తులను పరిశీలించాలని, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను తరలించే వాహనాల సంబంధిత పర్మిట్, ఫిట్నెస్ పత్రాలను తనిఖీ చేయాలని, లేని పక్షంలో క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలిపారు. వ్యవసాయ శాఖ పరిధిలో రైతుభరోసా, ప్రధానమంత్రి కిసాన్ యోజన సంబంధిత దరఖాస్తులను రాగా వాటిని పరిష్కరించడం జరిగిందని,



వానాకాలం-2025కు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచుకోవాలని, ఫర్టిలైజర్ దుకాణాలను సందర్శిస్తూ తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖ పరిధిలో 177 దరఖాస్తులు రాగా 1 పెండింగ్లో ఉందని, అధికంగా వస్తున్న అంశాల సంబంధిత దరఖాస్తులపై తీసుకున్న చర్యలతో నివేదిక అందించాలని తెలిపారు. మండల స్థాయి అధికారులు వారి పరిధిలోని సంబంధిత శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి అధికంగా వస్తున్న దరఖాస్తుల సంబంధిత అంశాలపై త్వరగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, 500 రూపాయలకు రాయితీ గ్యాస్ సిలిండర్ లపై వచ్చే దరఖాస్తులపై సంబంధిత అధికారుల సమన్వయంతో తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఉచిత ఇసుక సరఫరా, పారిశుద్ధ్యం, అనుమతి లేని నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మున్సిపల్ కమీషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, తహశిల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి పాఠశాలలో కల్పించిన సౌకర్యాలు, నెలకొన్న సమస్యలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుపై దృష్టి సారించి విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, వన మహోత్సవం అంశాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఆయిల్ పామ్ సాగు అభివృద్ధి, సంబంధిత అంశాలపై వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు సంయుక్తంగా కృషి చేసి నివేదిక అందించాలని తెలిపారు. వైద్య-



ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టి.బి. ముక్త్ భారత్ కొరకు చేపట్టిన చర్యలు, పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణ, కార్యక్రమాల అమలుపై పర్యవేక్షించాలని తెలిపారు. మండల స్థాయిలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి**

**ఆసిఫాబాద్ సూర్య మేజర్ న్యూస్ :**

రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధి దిశగా అనేక చర్యలు చేపడుతుందని, ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణ సదుపాయం కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తోడ్పాటు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్లు, మెప్మా సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణ సదుపాయం కల్పించి ఆర్థిక అభివృద్ధి సాధించే దిశగా ప్రోత్సహించాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీ 170 లక్ష్యం కాగా ఇప్పటివరకు 12 గ్రూపుల వారు లింకేజీ పూర్తి చేశారని, మిగిలిన 158 స్వయం సహాయక సంఘాల లింకేజీ ప్రక్రియ త్వరగా



పూర్తి చేయాలని, నూతన సంఘాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. క్రొత్తగా వివాహం అయిన వారిని గ్రూపులో సభ్యురాలుగా చేర్పించాలని, గ్రూపు సభ్యుల ఆధార్ సీడింగ్ ప్రక్రియలో 823 మందికి గాను 819 మంది ఆధార్ సీడింగ్ పూర్తి చేశారని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా గ్రూప్ ఎంటర్ప్రైజెస్, వ్యక్తిగత ఎంటర్ప్రైజెస్ నిర్వహించాలని, ప్రధానమంత్రి జన్ మన్ పథకం క్రింద పి.వి.టి.జి. లలో సభ్యులు లేని వారిని గుర్తించి గ్రూపులలో చేర్పించాలని తెలిపారు. ప్రధానమంత్రి జుగా క్రింద ఇతర గిరిజన మహిళలను సంఘాలలో సభ్యులుగా చేర్పించాలని, ప్రధానమంత్రి స్వ నిధి, సమృద్ధి నిధి, విశ్వకర్మ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కాగజ్ నగర్ మున్సిపాలిటీలో 170 మహిళా సంఘాలు ఉన్నాయని, ఆసిఫాబాద్ మున్సిపాలిటీ నూతనంగా ఏర్పాటు అయినందున మెప్మా సిబ్బంది గ్రూపుల వివరాలను సమీక్షించాలని తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ మోతిరామ్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, డి పి ఎం లు, స్త్రీ నిధి మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



## పోలీసులు విధులలో అప్రమత్తతో వ్యవరించాలి

**ఆదిలాబాద్, సూర్య మేజర్ న్యూస్ :**

విధులలో పోలీసు సిబ్బంది ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ సమయపాలన తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేసులలో ఉన్న వాహనాలను పరిశీలించి వాటి ప్రస్తుత స్థితి గతి పై ఆరా తీశారు. రికార్డుల నవీకరణలను ప్రతిరోజు క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. పెండింగ్లో ఉన్న కేసులను త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి కోర్టులను చార్జి షీటు దాఖలు చేయాలని సూచించారు. గ్రామాలను సందర్శిస్తూ పోలీసు మీకోసం కార్యక్రమాల నిర్వహించాలని తెలిపారు. ప్రతి గ్రామానికి విలేజ్ పోలీస్ ఆఫీసర్ ను కేటాయించి గ్రామాలలో జరుగుతున్న ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. రానున్నది పంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రతి ఒక్క సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరిస్తూ, పూర్తి సంసిద్ధమై ఉండాలని తెలిపారు. డయల్ 100, బ్లూ కోర్ట్, పెట్రో కార్ సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహిస్తూ ప్రమాదాలను నేరాల నియంత్రణకు కృషి చేయాలని తెలిపారు. కోర్టుల నందు పెండింగ్లో ఉన్న కేసులను పరిష్కరించినప్పుడే పోలీసుల పట్ల కోర్టుల నమ్మకం మరింత పెరుగుతుందని సూచించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ బాధితులకు సత్వరమే న్యాయం అందించే విధంగా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఎఎస్పీ కాజల్ సింగ్, ఉట్నూర్ సీఐ జి మొగిలి, ఎస్సై సాయన్న సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తప్పదు

**-రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య**
**-ఘనంగా టీడబ్ల్యూజేఎఫ్ మంచిర్యాల జిల్లా తృతీయ మహాసభ**

**నస్పూర్ , సూర్య మేజర్ న్యూస్**

తెలంగాణలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో మరింత జాప్యం చేస్తే రాష్ట్రవ్యాపిత ఆందోళన తప్పదని ఆయన









హెచ్చరించారు. శుక్రవారం మంచిర్యాలలోని నస్పూర్ సీసీసీ ప్రెస్ క్లబ్ లో టీడబ్ల్యూజేఎఫ్ మంచిర్యాల జిల్లా తృతీయ మహాసభ ఘనంగా జరిగింది. ఈ మహాసభలో రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు అండగా నిలిచి సమస్యలపై పోరాడే ఏకైక యూనియన్ టీడబ్ల్యూజేఎఫ్ అని అన్నారు. రాష్ట్రంలోని జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడుతున్న యూనియన్ టీడబ్ల్యూజేఎఫ్ మాత్రమే అని అన్నారు. అన్ని జిల్లాల్లో టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ బలపడుతుందని, ఈ నేపథ్యంలో అవగాహన లోపంతో ఫెడరేషన్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వానికి ఒక యూనియన్ వంతపాడితే ప్రస్తుత ప్రభుత్వానికి మరో యూనియన్ వంత పాడుతుందని ఎద్దేవా చేశారు. జిల్లాల్లో టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ బలోపేతానికి చేస్తున్న జిల్లా నాయకులను మామిడి సోమయ్య ఈ సందర్భంగా అభినందించారు. ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం మాట్లాడుతూ రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులందరికీ 20 వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయ్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులకు గత ప్రభుత్వం ఎలాంటి సంక్షేమ పథకాలు చేపట్టలేదని, జర్నలిస్టులకు అనేక సౌకర్యాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ప్రభుత్వం కూడా జర్నలిస్టులకు మొండి చేయి చూపిందని అన్నారు. కనీసానికి వర్కింగ్ జర్నలిస్టులకు కొత్తగా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వకుండా మూడు నెలలకోసారి స్టిక్కర్ల పేరుతో కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా జర్నలిస్టుల సంక్షేమంపై ఆలోచించి వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ మహాసభలో సీపీఐ రాష్ట్రదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్, ఫెడరేషన్ నేషనల్ కౌన్సిల్ మెంబర్,రాష్ట్ర కార్యదర్శి తన్నీర్ శ్రీనివాస్ రావు,కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడితాడు బాపురావు, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు యూసుఫ్, జిల్లా సన్నాహక కమిటీ కన్వీనర్ మిట్టపల్లి మధు, కో- కన్వీనర్లు వెంకట స్వామి గడ్డం సత్యా గౌడ్‌లు పాల్గొన్నారు.

మంచిర్యాల జిల్లా

## నూతన కమిటీ ఎన్నిక

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) మంచిర్యాల జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక్కైంది. అధ్యక్షుడుగా మిట్టపల్లి మధు(సూర్య), ఉపాధ్యక్షుడుగా వెంకటస్వామి(ప్రజాపాలన), కార్యదర్శిగా గడ్డం సత్యగౌడ్(నేటిధాత్రి), సంయుక్త కార్యదర్శులుగా నేరెళ్ళ నరేష్ గౌడ్, నరేందర్,నుమన్,రవి,కార్యనిర్వాహక కార్యదర్శులుగా,ఇప్ప సురేష్,సందవేని నర్సయ్య, సదానందం, శ్రీనివాస్,కోశాధికారి గా సబ్బని భాస్కర్,కార్యవర్గ సభ్యులుగా ఎండీ సుల్తాన్, ఎస్. మల్లేష్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటుగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా శానగొండ శ్రీనాథ్ ఎన్నిక్కైనట్లు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య ప్రకటించారు.

## నారాయణ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి-వామపక్ష విద్యార్థి సంఘాలు

**మంచిర్యాల టౌన్, జూన్ 19,సూర్య మేజర్ న్యూస్:**మంచిర్యాల కాలేజీ రోడ్ లో గల నారాయణ పాఠశాలలో ఎలాంటి నిబంధనలు పాటించకుండా పాఠశాలల్లోనే అక్రమంగా పుస్తకాలు అమ్ముతున్నారు గురువారం పాఠశాల ముందు వామపక్ష విద్యార్థి సంఘాల ధర్నా చేశారు. కనీసం ఎం ఆర్ పి రేటు లేకుండా పుస్తకాలు, టై,బెల్ట్,షూ పేర్లతో 5000 నుండి 15000 వరకు విద్యార్థి తల్లిదండ్రులను మభ్యపెడుతూ వసూలు చేస్తున్నారాన్నారు. పాఠశాలల్లో పుస్తకాలు అమ్మవద్దని ప్రభుత్వం ఆదేశించిన, కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో మాత్రం




విద్యార్థులను తల్లిదండ్రులను ఒత్తిడి తీసుకొస్తూ పుస్తకాలు టై, బెల్ట్, షూ కొనాలని వేల రూపాయలు వసూలు చేస్తున్నారు అన్నారు. అంతేకాకుండా అడ్మిషన్ల పేరుతోటి లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారాన్నారు. ఈ సమస్యపై మంచిర్యాల విద్యాశాఖ అధికారులు ఎంఈఓ నామమాత్రంగా,చుట్టం చూపుగా వచ్చి వెళ్లడం జరిగింది అన్నారు. పాఠశాలలో ఉన్నటువంటి పుస్తకాల గోదాం తాళం వేసారన్నారు. విద్యాశాఖ అధికారులు కేవలం కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థలకు కొమ్ముకాస్తున్నారు కాబట్టి,దీనిపై కలెక్టర్ స్పందించి సంబంధిత విద్యాశాఖ అధికారులు ను,డి ఈ ఓ ఈను జిల్లా నుండి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి తల్లిదండ్రులను మభ్యపెడుతూ అధిక ఫీజులు వసూలు చేస్తూ, ఎం ఆర్ పి ధర లేనటువంటి పుస్తకాలు అమ్ముతున్న నారాయణ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహించి సెక్రటేరియట్ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులపై ఫిర్యాదు చేస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీ డి ఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీకాంత్,ఏ ఐ ఎస్ బి జిల్లా కార్యదర్శి సన్నీ గౌడ్, యూ ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, జిల్లా నాయకులు పి డి ఎస్ యూ పి.సికిందర్,ఏ ఐ ఎస్ బి సుమన్, యూ ఎస్ ఎఫ్ ఐ మనిచరణ్ విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## భూ భారతి ద్వారా భూ సమస్యలకు తక్షణ పరిష్కారం- తహాశీల్దార్ తుకారాం

**సిరికొండ జూన్ 20 మేజర్ సూర్య న్యూస్**

భూ సమస్యల సత్వర పరిష్కారం కొరకు ప్రభుత్వం




రెవెన్యూ వ్యవస్థము ప్రజల వద్దకు తీసుకువచ్చిందని తహాశీల్దార్ తుకారాం అన్నారు భూ భారతి రెవిన్యూ సదస్సులో భాగంగా సిరికొండ మండల లోని సోన్ పల్లి గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సదస్సులో తహాశీల్దార్ తుకారాం మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కారానికి రైతులు భూ భారతి సద్వినియోగం చేసుకోవాలని అన్నారు ప్రభుత్వం ప్రజలకు రెవెన్యూ శాఖ ఉంటుందని తెలిపారు రెవెన్యూ సేవలను గ్రామ స్థాయిలో అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహాశీల్దార్ ఉపేంద్ర, రెవిన్యూ ఇన్స్పెక్టర్ వెంకట్రావు, గణేష్, పోశెట్టి, రాజేశ్వర్, వసంతరావు, అమోల్, దేవిదాస్, గ్రామస్తులు సూర్యకాంతం, మానిక్ రావ్ రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుపై మాదకద్రవ్యాల ప్రభావాన్ని నియంత్రించాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మొదటి పేజీ తరువాయి...



ఈ నెల 26న అంతర్జాతీయ యాంటీ డ్రగ్ డేను పురస్కరించుకొని వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఈ నెల 21న యోగా డేలో భాగంగా "సే నో టు డ్రగ్స్ - సే ఎస్ టు యోగా" నినాదంతో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన శిబిరాలు నిర్వహించాలని, 22న హైరిస్క్ జోన్స్, పని ప్రదేశాలలో అవగాహన కార్యక్రమాలు, 23వ తేదీన మొక్కలు నాటడం, 24, 25 తేదీలలో విద్యార్థినీ, విద్యార్థులు, యువతను భాగస్వామ్యులను చేస్తూ అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రధానం కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. 26వ తేదీన జిల్లా స్థాయిలో మిషన్ పరివర్తన స్టాల్స్ ఏర్పాటు, రాజకీయ నాయకులు, విద్యార్థులు సంయుక్తంగా ర్యాలీలు నిర్వహించి జిల్లా కేంద్రంలోని ఐ.బి. చౌరస్తాలో మానవహారం ఏర్పాటు చేసి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయాలని తెలిపారు. వారోత్సవాలలో భాగంగా చేపట్టే కార్యక్రమాల సంబంధిత ఫొటోలు, వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలపై విద్యార్థులకు వివరించాలని, మాదకద్రవ్యాల నియంత్రణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని, విద్యార్థుల అసాధారణ ప్రవర్తనను పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో డ్రగ్స్ రిహాబిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, బాధితులకు సేవలు అందించడం జరుగుతుందని, ఇన్-పేషెంట్ సేవలకు కావలసిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. మందుల దుకాణాలు, ఆసుపత్రులలో అందించే గుర్తించిన ప్రత్యేకమైన డ్రగ్స్ పై రిజిస్టర్ నిర్వహించాలని, వైద్యుల సూచన మేరకు మాత్రమే మందులు విక్రయించాలని, మత్తు మందుల విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మెడికల్, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐ.టి.ఐ., డిగ్రీ కళాశాలలలో మాదకద్రవ్యాలు, మద్యం వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థినీ, విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించాలని, గురుకులాలు, వసతిగృహాలు, అన్ని విద్యా సంస్థలలో ప్రహారీ, కారిడార్లు, పరిసరాలు స్పష్టంగా కనిపించే విధంగా సి.సి. కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆబ్కారీ- మద్యనిషేధ శాఖ ఆధ్వర్యంలో 409 కేసులు నమోదు కాగా 334 మందిని బైండోవర్ చేయడం జరిగిందని, బెల్టాపులు, గుడుంబా స్థావరాలపై పోలీసులు, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, అకస్మాత్తుగా కార్డన్ సర్చ్ కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. చట్ట విరుద్ధంగా మద్యం, గంజాయి, సిగరెట్లను విక్రయించే లైసెన్స్ లేని దుకాణాలను సీజ్ చేయాలని తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో అధికార యంత్రాంగం సమిష్టిగా పని చేయాలని తెలిపారు. అనంతరం కార్యక్రమం సంబంధిత కరపత్రాలు, గోడప్రతులను ఆవిష్కరించారు.

డి.సి.పి. మాట్లాడుతూ జిల్లాలో నమోదైన మాదకద్రవ్యాల సంబంధించి 2025 సంవత్సరంలో 33 కేసులు నమోదు కాగా 114 మంది అరెస్టు అయ్యారని, మాదకద్రవ్యాల తరలింపుపై ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేసి నిరోధించడం జరుగుతుందని తెలిపారు. ఎక్కడైనా మత్తు పదార్థాల నిల్వ ఉన్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100లో సమాచారం అందించి తగ్గుముఖం పట్టేలా సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ప్రధానంగా డ్రగ్స్ ఉత్పత్తి, రవాణాను అరికట్టడంలో టాస్కోర్స్ బృందాల ద్వారా చెక్పోస్ట్ల వద్ద విస్తృత తనిఖీలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. డ్రగ్ ఇన్స్పెక్టర్ జిల్లాలోని మందుల దుకాణాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సరైన అనుమతులు లేని దుకాణాలపై చర్యలు తీసుకోవడంతో పాటు వైద్యుల సూచన లేకుండా మందులు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ రూల్స్ పై విద్యార్థులకు అవగాహన సదస్సు-ఎస్సై

**శ్రీరాంపూర్ జూన్ 20 సూర్య మేజర్ న్యూస్:**

శ్రీరాంపూర్ లోని బస్టాండ్ ఏరియా లో విశ్వశాంతి స్కూల్ పిల్లలతో ట్రాఫిక్ రూల్స్, నియమాలు పాటించాలి అని అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. రామగుండం సిపి,



మంచిర్యాల డిసిపి ఆదేశాల మేరకు జైపూర్ ఏసిపి ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వేణు చందర్ పర్యవేక్షలో రోడ్డు సేఫ్టీ, ట్రాఫిక్ రేగులేషన్ పోలీసింగ్ లో భాగముగా శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా లో ప్రమాదాల నివారణ కు ఇటీవల రోడ్డు ప్రమాదంలో చిన్న పిల్లలు, స్కూల్ చిల్డ్రన్కి జరుగుతున్న దృష్ట్యా విశ్వశాంతి స్కూల్ విద్యార్థులకి ట్రాఫిక్ రూల్స్, నియమాలు పాటించాలి రోడ్డు దాటే



క్రమములో, పిల్లలని స్కూల్కి డ్రాప్ చేసే సమయంలో వారి తల్లి దండ్రులకు కూడా హెల్మెట్ ధరించాలి అని, మైనర్ బాలురు బైక్స్ నడపడం వల్ల వారి పేరెంట్స్ కి కూడా శిక్ష విధిస్తున్నట్లు తెలియజేయడం జరిగింది. అలాగే నిత్యం రోడ్డు ప్రమాదాలు ఎక్కువ అవుతున్నాయి కాబట్టి ప్రజలు కూడా రోడ్డు మీద వాహనాలు నడిపే సమయాల్లో జాగ్రత్తలు పాటించడం సీట్ బెల్ట్ పెట్టుకోవడం, హెల్మెట్ ధరించి వాహనం నడపడం, సెల్ ఫోన్ వాడకుండా డ్రైవింగ్ చేయడం, అతివేగంగా డ్రైవింగ్ చేయకుండా ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ రోడ్డు మీద వాహనాలు నడిపే సమయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకొవాలని ప్రజలకి శీరాంపూర్ ఎస్ఐ సంతోష్ సూచించారు.

## సిపిఐ నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలి

**సారంగాపూర్, జూన్ 21, సూర్య మేజర్ న్యూస్:**

నిర్మల్ జిల్లా కేంద్రంలో జూలై 6న నిర్వహించనున్న సిపిఐ నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఎస్. విలాస్ పిలుపునిచ్చారు.సారంగాపూర్ మండల కేంద్రంలో సిపిఐ నాలుగవ జిల్లా మహాసభల కరపత్రాన్ని వ్యవసాయ మార్కెట్ యార్డులో



విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 6 ఉదయం 11 గంటలకు గాంధీ పార్క్ నుండి ర్యాలీ ఉంటుందని, పెద్ద ఎత్తున నిర్వహించనున్న మహాసభలకు ముఖ్య అతిథులుగా కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు, కామ్రేడ్ చాడ వెంకటరెడ్డి, హాజరుకానున్నారని మండలం నుండి ఎక్కువ సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు. కరపత్రం విడుదల కార్యక్రమంలో కామ్రేడ్ ఎస్.ఎన్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ భూక్య రమేష్, పట్టణ కార్యదర్శి పరికిపండ్ల గంగన్న, సారంగాపూర్ కార్యదర్శి ఆడేల్లు, సైదా రాములు, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను పంపిణీఎమ్మెల్సీ దండే విఠల్

**కాగజ్నగర్, జూన్ 20, సూర్య మేజర్ న్యూస్:**



కాగజ్ నగర్ మున్సిపల్ వార్డులలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుక్రవారం మంజూరు పత్రాలను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పేదవాడికి పక్కా ఇండ్లు నిర్మించాలని సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ పకడ్బందీగా అమలు చేస్తుంది అని ఆయన అన్నారు. ప్రజా ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేస్తున్నాం అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల మున్సిపాలిటీ అభివృద్ధి సాధ్యం అని అన్నారు. వారి వెంట తాజా మాజీ చైర్మెన్లు మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# నస్పూర్ పట్టణ పరిధిలో అధ్వానంగా పారిశుద్ధ్యం

### - వారం రోజులుగా ఇళ్లలోనే పేరుకుపోయిన చెత్త కుప్పలు

### - చెత్తను తరలించే ట్రాలీలు రాకపోవడంతో వెదజల్లుతున్న దుర్వాసన




**నస్పూర్, జూన్ 19, సూర్య మేజర్ న్యూస్:**

నస్పూర్ పట్టణ పరిధిలోని పలు వార్డులలో చెత్తా చెదారం పేరుకుపోవడంతో పారిశుధ్యం అధ్వానంగా మారింది. వీధుల్లోని చెత్తకుప్పలను పారిశుధ్య సిబ్బంది తరలించాల్సి ఉండగా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎక్కడికక్కడే చెత్త కుప్పలు పేరుకుపోయాయి. దీంతో పరిసరాల్లో దుర్గంధం వెదజల్లటంతో అటుగా వెళ్లాలంటే



ముక్కు మూసుకుని వెళ్ళాల్సిందేనని, దోమలు, ఈగలకు ఆవాసంగా మారుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నస్పూర్ గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడే బాగుండేదని, రాను రాను పట్టణం అభివృద్ధి చెందాల్సింది పోయి ఇంకా అధ్వానంగా తయారైందని అంటున్నారు. ఇదివరకు వారంలో మూడుసార్లు వచ్చే చెత్త తీసుకువెళ్లే ట్రాలీలు, ఇప్పుడు వారం గడుస్తున్న రావడంలేదని, ఇళ్లల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తుందని పలు కాలనీలవాసులు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్, మునిసిపాలిటీలలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని 100 రోజులపాటు సమస్యలు లేని పట్టణాలుగా మార్చాలని అన్నారు. అలాగే స్వచ్ఛతపై ఇంటింటి ప్రచారం, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించక పోవడం తో నగరవాసులకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీలో చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

**శివకుమార్ నస్పూర్ సానిటరీ ఇన్స్పెక్టర్**

నస్పూర్ పరిధిలో చెత్త తరలించే ట్రాలీలు 42 ఉన్నాయి, కానీ ప్రస్తుతం 12 మాత్రమే పనిచేస్తున్నాయి. మున్సిపాలిటీగా ఉన్నప్పుడు పారిశుద్ధ్య సిబ్బంది 222 మంది ఉన్నారు, ప్రస్తుతం 52 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు, అందుకే ఆలస్యం అవుతుంది. ప్రజలకు ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు చేపడతాం.

## ఘనంగా మాజీ మున్సిపల్ చైర్మన్ 6వ వర్ధంతి

**కాగజ్నగర్, జూన్ 20, సూర్య మేజర్ న్యూస్:**

కాగజ్నగర్ పట్టణంలోని పద్మశాలి భవనంలో స్వర్గీయ గుల్లపల్లి బుచ్చిలింగం ఆరవ వర్ధంతి సందర్భంగా బుచ్చిలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన పద్మశాలి సంఘం నాయకులు. శుక్రవారం కాగజ్ నగర్ పట్టణంలోని పద్మశాలి భవన్



లో భవన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పద్మశాలి ముద్దు బిడ్డ, మాజీ తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి, కాగజ్ నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ స్వర్గీయ గుల్లపల్లి బుచ్చిలింగం యొక్క 6వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులు అర్పించిన కాగజ్ నగర్ పట్టణ పద్మశాలి సంఘం నాయకులు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ బుచ్చిలింగం క్రమశిక్షణతో నమ్ముకున్న సిద్ధాంతాలకు కట్టుబడిన మహా వ్యక్తి అని ఆయన చిన్న వయసులోనే కాగజ్నగర్ మున్సిపల్ చైర్మన్గా పదవి చేపట్టి కాగజ్నగర్ అభివృద్ధికి కృషి చేశారని. అదేవిధంగా తెలుగుదేశం పార్టీలో ఎన్టీఆర్ అభిమానిగా మొదలుకొని కార్యకర్త నుండి రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర కార్యక్రమాల కమిటీ చైర్మన్గా పార్టీకి అంకితభావంతో పార్టీ బలోపేతం కోసం తను చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ పట్టణ పద్మశాలి సేవ సంఘం మార్గదర్శకులు భవన నిర్వహణ కమిటీ అధ్యక్షులు సింధం చంద్రయ్య, భవన కమిటీ సభ్యులు గుల్లపెల్లి నాగేశ్వరరావు, రాపెల్లి సదానందం, గడదాసు మల్లయ్య, వోడ్నాల వెంకన్న, కొంగ సత్యనారాయణ, గుల్ల పెల్లి ఆనంద్, సింధం శ్రీనివాస్, దాసరి వెంకటేష్, కొంగ సంపత్ కుమార్, పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.

## రైతు భరోసా పై బిన్నా అభిప్రాయాలు

### - రభి సీజన్ లో డబ్బులు రాని రైతుల లో ఆందోలన

**భీమిని, జూన్19, సూర్య మేజర్ న్యూస్:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా కార్యక్రమం కింద ఖరీఫ్ సీజన్కు సంబంధించిన పెట్టుబడి నిధులు సోమవారం నుంచి రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయి.రభి సీజన్లో అందరి రైతులకు డబ్బులు రాలేదు, నాలుగు ఎకరాలనుంచి డబ్బులు అప్పుడు మంజూరు కాలేదు, అప్పుడు ఇప్పుడు అంటూ కాలయాపన చేశారు, ఇప్పుడు వానాకాలం పంటసహాయం ప్రకటించి డబ్బులు ప్రభుత్వం నిధులు విడుదల చేయటం ప్రారం బించినది. ఐతే అప్పుడు డబ్బులు రాని రైతులలో ఇప్పుడు ఆందోళన వ్యక్తం అవుతున్నది, అప్పటి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఆలస్యం జరుగుతుందని..అందరికీ సహాయం అందుతుందని రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నాయకులు గతంలో హామీ ఇచ్చినా..డబ్బులు మాత్రం రాలేదు, గత రబీ సీజన్లో ప్రభుత్వం ఎంచుకున్న పైలట్ గ్రామాలలో మినహా..పలుచోట్ల నాలుగు ఎకరాలలోపు భూమి ఉన్న రైతులకే రైతు భరోసా మొత్తం చేరింది. ఆ పైన భూమి ఉన్న మిగిలిన అన్నదాతలకు ఆనాటి సాయం అందని పరిస్థితి నెలకొంది. ఈసారైనా తమకు పూర్తిగా నిధులు అందుతాయా లేదా అనే సందేహంలో రైతులు ఉన్నారు. ఒకవేళ స్థానిక ఎన్నికల నేపథ్యంలో కేవలం ఖరీఫ్ సీజన్ డబ్బులు మాత్రమే జమ చేసి.. రబీ సీజన్ బకాయిలు ఇక రావని సంకేతాలు వస్తే..ప్రభుత్వం పై వ్యతిరేకత ఏర్పడుతుందని పలువురు అంటున్నారు, ..నాలుగు ఎకరాలలోపు ఉన్న వారికి రబీ, ఖరీఫ్ రెండు సీజన్లకు నిధులు అందినందుకు కొంతమంది మిగతా వారిని సంగతి ఏమిటని ప్రశ్నలు వెలువడుతున్నాయి, రెండుసార్లు రైతు భరోసా పొందిన వారిని చూసి, ఒక్కసారి మాత్రమే సాయం అందిన రైతులు కూడా తమకు అప్పటి రబీ, ఇప్పటి ఖరీఫ్ రెండు సీజన్ల డబ్బులు రావాలని కోరుకుంటున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో...ప్రభుత్వం రైతుల మధ్య ఉన్న ఈ అసంతృప్తిని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అన్ని వర్గాల రైతులకు న్యాయం చేసి, వారికి పూర్తి ఆర్థిక భరోసా కల్పించడం ద్వారానే ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోగలరు. రైతు భరోసా పథకం



వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం..అన్నదాతలను అప్పుల ఊబి నుంచి బయటపడవేయడం, వ్యవసాయ పెట్టుబడికి సాయం అందించడం. ఈ లక్ష్యం నెరవేరాలంటే..పథకం అమలులో ఎలాంటి వ్యత్యాసాలు ఉండకూడదని రైతులు, ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి...రబీ బకాయిలపై స్పష్టమైన ప్రకటన చేసి, అర్హులైన ప్రతి రైతుకు నిధులు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

## 5 ఎకరాల వరకు రైతుల ఖాతాలలో రైతు భరోసా - జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఆసిఫాబాద్ ప్రతినిధి,జూన్ 20, సూర్య మేజర్ న్యూస్ :**
రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద జిల్లాలో 5 ఎకరాల వరకు భూమి గల రైతుల ఖాతాలలో రైతు భరోసా నగదు జమ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వ్యవసాయ పనులలో నిమగ్నమైన వేళ ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించడంతో రైతులు ఆనందంగా ఉన్నారని తెలిపారు. జిల్లాలోని 1 లక్ష 42 వేల 386 మంది రైతులకు 264 కోట్ల 30 లక్షల రూపాయల పెట్టుబడి సహాయం అందించవలసి ఉండగా, శుక్రవారం జిల్లాలో 5 ఎకరాల వరకు భూమి గల రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరిగిందని, త్వరలోనే మిగతా వారికి అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ప్రతి ఆటోకు క్యూ.ఆర్ కోడ్ ఉండాలి

**బేల, జూన్ 20, సూర్య మేజర్ న్యూస్ :**
మండల కేంద్రంలోని వారసంతలో జైనథ్ సీఐ డి.సాయినాథ్ ఆటోలకు మై ఆటో ఈస్ సేఫ్ లో భాగంగా శుక్రవారం ఆటోలకు క్యూ ఆర్ కోడ్ స్టిక్కర్ లను అందజేశారు.ఈ సందర్భంగా సీఐ డి. సాయినాథ్ మాట్లాడుతూ ఆటోలకు క్యూఆర్ కోడ్ ద్వారా ప్రయాణికులు ఆటోల గురించి సమాచారం పొందవచ్చు, అవసరమైతే పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.సురక్షితమైన ప్రయాణ భద్రత కోసమే 'మై ఆటో ఈజ్? సేఫ్'కార్యక్రమం అని అన్నారు.ఆటోలో ప్రయాణించే వారు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా పూర్తి వివరాలు తెలుస్తాయని, తాము సురక్షితంగా ప్రయాణం చేస్తున్నామని ధీమా కలుగుతుందని పేర్కొన్నారు.ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇళ్ల అవకతవకలపై బహిరంగ చర్చకు కాంగ్రెస్ నాయకులకు బీజేపీ సవాల్

**వాంకిడి, జూన్ 20,సూర్య మేజర్ న్యూస్**
వాంకిడి: ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, రేపు ఉదయం 11 గంటలకు వాంకిడి ఎంపీడీవో కార్యాలయం వద్ద బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ నాయకులకు బీజేపీ వాంకిడి మండల శాఖ సవాల్ విసిరింది.ఈ సందర్భంగా వాంకిడి మండల కేంద్రంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో భారతీయ జనతా యువమోర్చా అధికార ప్రతినిధి ఎలగతి సుచిత్ మాట్లాడుతూ, "ఇందిరమ్మ పథకం కేవలం కాంగ్రెస్ నాయకుల బంధువులకు మాత్రమే వర్తించిందని, అర్హులైన సామాన్యులకు న్యాయం జరగలేదని" ఆరోపించారు. మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలోని కమిటీలు తమ బంధువులకే ఇళ్లు మంజూరు చేశాయని చెప్పారు."కాంగ్రెస్ నాయకులు నిజంగా అవినీతికి పాల్పడలేదని నమ్మకం ఉంటే రేపు బహిరంగ చర్చకు హాజరుకావాలి" అని సవాల్ చేశారు.ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు చీదాల నరేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు వనపర్తి సదాశివ్, సీనియర్ నాయకుడు డైరెక్టర్ దేనా వేణి, బీజేవైఎం వాంకిడి అధ్యక్షుడు వికాస్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న ఆత్రం సుగుణక్క

**ఆదిలాబాద్ (ఉట్నూర్)జూన్ 20,సూర్య మేజర్ న్యూస్**
కాంగ్రెస్ పార్టీ సంవిధాన్ బచావో ప్రోగ్రామ్ రాష్ట్ర కమిటీ చైర్మన్ పి.వినయ్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్ లోని గాంధీ భవన్ లో రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్,సంవిధాన్ బచావో ప్రోగ్రామ్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఆత్రం సుగుణక్కతో పాటు పలువురు సభ్యులు, అన్ని జిల్లాల పరిశీలకులు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో దేశవ్యాప్తంగా చేపడుతున్న సంవిధాన్ బచావో ప్రోగ్రామ్ని ప్రజల్లోకి ఎలా తీసుకు వెళ్ళాలి,తదితర విషయాలపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు.ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగం పరిరక్షణ కోసం జై బాపు'జై భీమ్ జై సంవిధాన్ అభియాన్' కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా చేపట్టాలని తీర్మానించారు.




### కనీస కూలీ ధరల

## అమలుకు చర్యలు

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్


**మంచిర్యాల,జూన్20సూర్య మేజర్ న్యూస్ :**
జిల్లాలో కనీస కూలీ ధరల అమలు కొరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కార్మికులను 3 వర్గాలుగా విభజించడం జరిగిందని, వర్గాల వారిగా కనీస కూలీ ధరలు అమలు చేసేందుకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇందులో అన్-స్కిల్డ్ కార్మికులకు 2022-23సం.లో మున్సిపల్ ప్రాంతంలో 478రూపాయలు,నాన్-మున్సిపల్ ప్రాంతంలో 434 రూపాయలు, ఏజెన్సీ ప్రాంతంలో 516 రూపాయలు చెల్లించగా 2024-25, 2025-



26 సం.లో మున్సిపల్ ప్రాంతంలో 574 రూపాయలు, నాన్-మున్సిపల్ ప్రాంతంలో 521 రూపాయలు, ఏజెన్సీ ప్రాంతంలో 619 రూపాయలుగా చెల్లించేందుకు ప్రతిపాదించడం జరిగిందని తెలిపారు. సెమీ-స్కిల్డ్ కార్మికులకు 2022-23 సం.ఎంలో మున్సిపల్ ప్రాంతంలో 569 రూపాయలు, నాన్-మున్సిపల్ ప్రాంతంలో 545 రూపాయలు, ఏజెన్సీ ప్రాంతంలో 638 రూపాయలు చెల్లించగా 2024-25, 2025-26 సం.ఎంలో మున్సిపల్ ప్రాంతంలో 683 రూపాయలు, నాన్-మున్సిపల్ ప్రాంతంలో 654 రూపాయలు, ఏజెన్సీ ప్రాంతంలో 766 రూపాయలుగాచెల్లించేందుకు ప్రతిపాదించడం జరిగిందని తెలిపారు. స్కిల్డ్ కార్మికులకు 2022-23 సంలో మున్సిపల్ ప్రాంతంలో 640 రూపాయలు, నాన్-మున్సిపల్ ప్రాంతంలో 613 రూపాయలు, ఏజెన్సీ ప్రాంతంలో 711 రూపాయలు చెల్లించగా 2024-25, 2025-26 సం.లో మున్సిపల్ ప్రాంతంలో 768 రూపాయలు, నాన్-మున్సిపల్ ప్రాంతంలో 736 రూపాయలు, ఏజెన్సీ ప్రాంతంలో 853 రూపాయలుగా చెల్లించేందుకు ప్రతిపాదించడం జరిగిందని తెలిపారు. సి.పి.ఐ. (కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్), ఎస్.ఓ.ఆర్. (షెడ్యూల్ ఆఫ్ రేట్) ఆధారంగాపెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీ ధరలను పెంపొందించడం జరిగిందని, ఇందులో భాగంగా గతంతో పోల్చితే కనీస కూలీ ధరలను 20 శాతం పెంచి ప్రతిపాదనలు సమర్పించగా కమిటీ సభ్యులు అంగీకరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశాల కోసం లక్కీ డ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక

**నిర్మల్,జూన్20,సూర్య మేజర్ న్యూస్ :**
జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో 1వ, 5వ తరగతులలో ప్రవేశాల కోసం విద్యార్థులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు.శుక్రవారం సాయంత్రం




కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన జిల్లా అధికారులతో కలిసి లక్కీ డ్రా నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వెనుకబడిన కులాల విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల స్థాయిలో కార్పొరేట్ విద్యను అందించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎంపిక కాలేని విద్యార్థులు, తల్లిదండ్రులు నిరాశ చెందవద్దన్నారు. ఈ సంవత్సరం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశాల కోసం 1వ తరగతికి 83 దరఖాస్తులు అందగా, లక్కీ డ్రా ద్వారా 49 మందిని ఎంపిక చేయగా, 5వ తరగతికి 247 దరఖాస్తులు వచ్చి, 52 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. ఒక్కో తరగతికి తగినంగా ఉచిత రవాణా, వసతి, పుస్తకాలు, యూనిఫాం వంటి సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి వి. రాజేశ్వర్ గౌడ్, జిల్లా విద్యాధికారి పి. రామారావు, సహాయ సంక్షేమ అధికారి డి. లత, పర్యవేక్షకులు శ్రీదేవి, డిసిఓ ప్రశాంతి, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసాలో 1 లక్షా 37 వేల 503 రైతుల ఖాతాలలో నగదు జమ- జిల్లా వ్యవసాయ అధికారి కల్పన

**మంచిర్యాల,జూన్21,సూర్య మేజర్ న్యూస్ :**
రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన రైతుభరోసా పథకంలో భాగంగా 1 లక్షా 37 వేల 503 రైతుల ఖాతాలలో 142 కోట్ల 2 లక్షల 93 వేల 198 రూపాయలు జమ చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి కల్పన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 18 మండలాలలోని 419 గ్రామాలలో 1 లక్షా 71 వేల 307 మంది రైతులకు 205 కోట్ల రూపాయల రైతు భరోసా అందించవలసి ఉండగా 1 లక్షా 46 వేల 946 మంది రైతులకు సంబంధించిన 177 కోట్ల 20 లక్షల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు పంపించడం జరిగిందని, 1 లక్షా 37 వేల 503 రైతుల ఖాతాలలో 142 కోట్ల 2 లక్షల 93 వేల 198 రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు.



## తెలంగాణ ప్రభుత్వ క్రీడ పాఠశాలలలో ప్రవేశం కొరకు ఎంపిక పోటీలు..జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఆసిఫాబాద్, జూన్ 20, సూర్య మేజర్ న్యూస్ :**2025- 26 విద్యా సంవత్సరానికి గాను క్రీడా పాఠశాలలలో 4వ తరగతిలో ప్రవేశం కొరకు ఈ నెల 25వ తేదీన ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే శుక్రవారం ఒక ప్రకటనలు తెలిపారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ లలోని తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలలో విద్యార్థుల ఎంపిక కొరకు మండల స్థాయి పోటీలలో పాల్గొని మెరిట్ సాధించిన విద్యార్థిని విద్యార్థులకు జిల్లా స్థాయిలో ఈ నెల 25వ తేదీన జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాల మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా స్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జూలై 1వ తేదీ నుండి 5వతేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్స్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల పరుగు, 6×10 మీటర్ల షటిల్ రన్ మెడిసిన్ బాల్ త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ పరీక్షలతో పాటు ఎత్తు, బరువుతో కలిపి మొత్తం 9 విభాగాలలో 27 మార్కులకు ఫిజికల్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, వయసు ధ్రువీకరణ, బోన్ అబ్నార్మలిటీస్ లో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. హకీంపేటలోని క్రీడా పాఠశాలలో 20మంది బాలురు,20 మంది బాలికలు, కరీంనగర్ లోని క్రీడా పాఠశాలలో 20 మంది బాలురు, 20 మంది బాలికలు, ఆదిలాబాద్ లోని క్రీడా పాఠశాలలో 20 మంది బాలురు,20 మంది బాలికల సీట్ల కొరకు ఎంపిక పూర్తి పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇతర వివరాలకు 8008090626 నంబర్ లో సంప్రదించవచ్చని, ఆసక్తి అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## రాజకీయ లబ్ధి కోసమే బిఆర్ఎస్, బీజేపీ అబద్ధాపు మాటలు

**ఖానాపూర్ సూర్య మేజర్ న్యూస్ :** శుక్రవారం ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఖానాపూర్ నియజక వర్గానికి మంజూరైన యాంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఎమ్మెల్యే ఉట్నూరుకు తరలించారని ఆరోపిస్తూ, గురువారం నిరసన కార్యక్రమం చేపట్టి, చేసిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవాలు లేవు అని, కేవలం రాజకీయ లబ్ధి పొందేందుకు, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కావాలని రాద్ధాంతం చేసి ప్రజలను బీజేపీ,బిఆర్ఎస్ నాయకులు తప్పుదోవ పట్టిస్తున్నారు అని మండిపడ్డారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటినుండి నుండి కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా లాంటి అభివృద్ధి పథకాల్లో దూసుకెలుతున్న విషయాన్ని జీర్ణించుకోలేక,అబద్ధపు ధర్నాలు,అవస్తవపు మాటలు మాట్లాడుతున్నారు అని అన్నారు.ఖానాపూర్ నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ పాఠశాల మొదటి విడతలోనే కట్టించాలనే ఏకైక ఉద్దేశ్యంతో ఖానాపూర్ పట్టణంలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతోనే ఉట్నూర్లో సర్వే చేయించారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దయానంద్, మాజీ మున్సిపల్ చైర్మన్లు సత్యం,రాజేందర్ , మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మజీద్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు,నాయకులు పాల్గొన్నారు.

# వినూత్న పద్ధతిలో విద్యార్థులచే ట్రాఫిక్ విధులు నిర్వహణ

## - స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ నియమాల పై అవగహన సదస్సు

**రామకృష్ణాపూర్, జూన్ 20, సూర్య మేజర్ న్యూస్:**

రామకృష్ణాపూర్ ఎస్ ఆర్ కె స్కూల్ లో శుక్రవారం స్థానిక ఎస్సై రాజశేఖర్ పాఠశాలలోని విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు వివరించడం జరిగిందనీ రోడ్డు దాటుతున్నపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాహనాలలో ప్రయాణం చేస్తున్నపుడు ముఖ్యంగా పాటించవలిసిన నియమాలను విద్యార్థులకు చెప్పడంతో పాటు, కొంతమంది విద్యార్థులతో ట్రాఫిక్ లోని పోలీసులు నిర్వర్తించే డ్యూటీలు వారికి అర్థం అయ్యేలా వారితో ఒక ట్రాఫిక్ డ్యూటీ (డ్రిల్) చేపించడం జరిగింది.





విద్యార్థులు తమవంతు బాధ్యతగా తమ కుటుంబసభ్యులకు, వారు నివసించే ఏరియాలాలో వాహనాలు నడిపేవారికి, హెల్మెట్ ఆవశ్యకత, ట్రాఫిక్ సిగ్నల్స్ ను అనుసరించే విధానం అందరికీ తెలిపేలా, అలాగే ట్రిబుల్ రైడింగ్ చేయవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదనే విషయాన్ని ట్రాఫిక్ నియమాలు తెలియపరిచాలని విద్యార్థులకు వివరించడం జరిగిందనీ ఎస్ఐ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ రాజశేఖర్, రెండవ అదనపు మహిళా ఎస్ఐ లలిత, హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య, కానిస్టేబుల్ శ్రీధర్, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

## - యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సిద్ధల నాగరాజ్

**నిర్మల్, జూన్ 20, సూర్య మేజర్ న్యూస్:**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని నారాయణ పాఠశాలని సీజ్ చేయాలని ధర్నా చేయడం జరిగింది. ధర్నా చేసిన అనంతరం జిల్లా విద్యాధికారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సిద్ధల నాగరాజ్ మాట్లాడుతూ నిర్మల్ పట్టణ కేంద్రంలో ఉన్నటువంటి నారాయణ విద్యాసంస్థలు ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా గత రెండు సంవత్సరాలుగా నిర్మల్ జిల్లాలో స్కూల్ నడుపుతున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. ప్రభుత్వం నుంచి ఒక విధంగా అనుమతి ఉంటే మరొక విధంగా పాఠశాలకు తోక పేర్లు పెడుతూ అక్రమంగా అడ్మిషన్ చేస్తూ మాయ మాటలు చెబుతూ కొనసాగుతున్నారు, ప్రభుత్వం నుంచి అనుమతి ఉంటే జీవో ఇవ్వగలరు అని అన్నారు అలాగే అధిక ధరలకు పుస్తకాలు అమ్ముతున్న అలాగే పాఠశాలలో యూనిఫాం పుస్తకాలు



బ్యాగులు అమ్ముతున్నారు విద్యా చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఒకవేళ బయట పుస్తకాలు కొంటాము అంటే యజమాన్యాలు పిల్లలపై ఒత్తిడి చేస్తున్నారు ఇదంతా జరుగుతున్నా కూడా మండల విద్యాధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం కూడా లేదు విద్యాశాఖ అధికారులు సర్కులర్ జారీ చేసినా కూడా కార్పొరేట్ విద్యాసంస్థ నారాయణ ను పట్టించు కోవడం లేదు విచ్చలవిడిగా పుస్తకాల దంధాన్ని కొనసాగిస్తున్నారు, వెంటనే ఈ పాఠశాల పైన కఠిన చర్యలు తీసుకోవాలి లేనిపక్షంలో పాఠశాల ఎదురుగా ధర్నా చేస్తామని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామత్కర్ నవీన్, పిడిఎస్యు అనిల్, పిడిఎస్యు నరేందర్, టిఎన్వీఎస్, వెంకటేష్, పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షులు పవర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ కు ఘనంగా సన్మానం

**శ్రీరాంపూర్,జూన్20,సూర్య మేజర్ న్యూస్**

శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ కార్యాలయంలోని సమావేశమందిరం లో పర్సనల్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న ఎల్. శ్రీధర్ ని డీజీఎం పర్సనల్ ఎస్ అనిల్ కుమార్ కు ఘనంగా సన్మానం జరిగింది. ఈ సందర్భంగా డీజీఎం పర్సనల్ ఎస్. అనిల్ కుమార్ మాట్లాడుతూ.. పర్సనల్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగుల పనితీరును బట్టి వారిని గుర్తించి వారికి



ప్రశంసా పత్రము బహుమతిని అందజేయడం జరుగుతుందని, అందులో భాగంగా క్వాటర్స్ విభాగంలో పనిచేస్తున్న ఎల్ శ్రీధర్ ని అభినందించడం జరుగుతుందని, ఉద్యోగులందరూ తప్పనిసరిగా వారి పనితీరును మెరుగుపరచుకొని అత్యుత్తమ ప్రదర్శనలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, డివై పిఎం లు రాజేష్, వి. దేవేందర్ రెడ్డి, సీనియర్ పిఓ లు పి. కాంతారావు, మురళీ పర్సనల్ విభాగ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల కు ముగ్గు పోసిన అధికారులు నాయకులు

**లోకేశ్వరం జూన్ 20, సూర్య మేజర్ న్యూస్:**

రాయపూర్ కాడ్లీ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల య్నెక్క ముగ్గు పోయడం జరిగిందని తెలియజేశారు ఈ సందర్భంగా అధికారులు నాయకులు మాట్లాడుతూ గ్రామంలో 39 ఇండ్లు మంజూరు కాగా బుధవారం రోజు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించడం కోసం భూమి పూజ చేయడం జరిగిందని 100 గజాల నుండి 600 గజాలు స్థలంలో నిర్మించడం జరుగుతుందని 5లక్షల వరకు అమౌంట్ వస్తుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో డిఈ దయానంద్ హౌసింగ్ ఏఈ పంచాయతీ సెక్రెటరీ నారాయణ మండల కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# మారక ద్రవ్యాలపై అవగాహన

## -ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

## - ఎస్సై హనుమండ్లు

**పెంబి, జూన్ 20, సూర్య మేజర్ న్యూస్:**

ప్రజలు మారక ద్రావ్యాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పెంబి ఎస్సై హనుమండ్లు అన్నారు.శుక్రవారం మండల కేంద్రం లో సమావేశం నిర్వహించి గంజాయి, డ్రగ్స్, గుట్కా, మత్తు



పదార్థాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు.ఎలాంటి మత్తు పదార్థాలను వాడకుండా కుటుంబంపై బాధ్యత తో మెలగాలని కోరారు. ఈ సందర్భంగా మళ్ళీ మారక ద్రావ్యాలను,మత్తు పదార్థాలను వాడకుండా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై హనుమండ్లు, పోలిస్ సిబ్బంది ఎస్డి ముజీబ్,రవి,గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ యోగ దశాబ్ది వారోత్సవాలు

**నిర్మల్ జూన్ 20, సూర్య మేజర్ న్యూస్:**

అంతర్జాతీయ యోగ దశాబ్ది వారోత్సవాల సందర్భంగా, ఆయుష్ విభాగం నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణ స్కూల్, భాగ్యనగర్‌లో యోగ ఆసనాలు, ఉపన్యాస పోటీలు నిర్వహించారు.



ఈ కార్యక్రమంలో ఆయుష్ జిల్లా ఇంచార్జీ డా. నారాయణ రావు, ఆయుష్ వైద్యులు వెంకటేశ్వర్లు, సంధ్యా రాణి, మనీషా, యోగ అధ్యాపకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజల్లో ఆరోగ్యపరమైన అవగాహన పెంచే ఉద్దేశంతో ఈవిధంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. పోటీల్లో పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ యోగ డే సందర్భంగా జూన్ 21న జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక చేయూత

**రామకృష్ణాపూర్, జూన్ 20, సూర్య మేజర్ న్యూస్:**

రామకృష్ణాపూర్ స్థానిక ఆర్కే ఫోర్ గడ్డ ఆటో డ్రైవర్ గోగర్ల భీమయ్య గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈనెల 9 తారీఖున మరణించడం జరిగింది, అతని కుటుంబానికి రామకృష్ణాపూర్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మృతుని కుటుంబాన్ని పరామర్శించి పదివేల రూపాయలు 10,000/- అతని కుటుంబానికి ఆర్థిక సాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు. గాండ్ల సమ్మన్న. అధ్యక్షులు ఎనగంటి సంపత్, ఉపాధ్యక్షులు పాక అంజయ్య, కమిటీ సభ్యుల సమక్షంలో అందజేయడం జరిగినది.

# మెడికల్ సీటు సాధించిన విద్యార్థిని సన్మానించిన టీచర్లు

## - గురుకుల విద్యార్థి విజయ ఢంకా

**కాగజ్నగర్, జూన్ 20, సూర్య మేజర్ న్యూస్:**

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గురుకులాల ఘనవిజయం. మహాత్మ జ్యోతిబాపూలే చిన రాస్పల్లి కాగజ్నగర్ పాఠశాలలో పదవ తరగతి



వరకు చదివినటువంటి విద్యార్థి కే .చరణ్ కు 2025లో నిర్వహించినటువంటి నీట్ పరీక్షలో మంచి ర్యాంకు వచ్చి ఎంబిబిఎస్ లో సీట్ సాధించడం జరిగిందని ఎం జె బి పాఠశాల అధ్యాపకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మంగా టీచర్లు అనిత, ఆసియా ఆ విద్యార్థుడిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

# అంగన్వాడి భవనాల నిర్మాణానికి నిధుల మంజూరు

## -ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

**భైంసా టౌన్, జూన్ 20, సూర్య మేజర్ న్యూస్:**

ముథోల్ నియోజకవర్గంలోని ఏడు అంగన్వాడి కేంద్రాల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలియజేశారు.ఒక్క భవన నిర్మాణానికి 12 లక్షల రూపాయల నిధులు ఇవ్వన్నట్లు చెప్పారు. భైంసా మండలంలోని సుంక్లి, కుభీర్ మండల కేంద్రం లోని మొదటి అంగన్వాడి కేంద్రం, కుంటాల మండలంలోని లింబ కె, లోకేశ్వరం మండలంలోని రాజురా, తానూర్, బాసర, ముథోల్ మండల కేంద్రాల్లో అంగన్వాడి భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి అంగన్వాడి కేంద్రాలు అద్దె గదుల్లో కొనసాగడం మూలంగా చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని సమస్యను దృష్టిలో ఉంచుకొని దశలవారీగా నిధులు మంజూరు చేయించనున్నట్లు చెప్పారు. ఏడు అంగన్వాడి కేంద్రాలకు 84 లక్షల రూపాయల నిధులు వచ్చాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.

